
# చిలక

ఇచ్ఛాపురపు రామచంద్రం



"ఏలా వుంది?" ఆత్రంగా అడిగాడు యాదగిరి.

అయ్య అందించిన కొత్తరకం మిఠాయిని తినడం అప్పుడే ముగించిన పాప "చాలా బావుంది" అంది. చాలా అంటున్నప్పుడు కళ్లెగరేస్తూను, బావుంది అంటున్నప్పుడు నాలుకతో పెదాలు రాసుకుంటూనూ.

"చాలా అంటే ఎంత?" కావాలనే అడిగాడు యాదగిరి. పాప చేత మాట్లాడించడమంటే అతని కెంతో సరదా. పాప మాటలు వింటూంటే అతనికి తియ్యని సంగీతం వింటున్నట్లే ఉంటుంది. ప్రపంచమే మరపున పడిపోతుంది.

"నీ ముద్దులా.... అంత బావుంది...." అరిందీలా చెబుతూ అతని చంకెక్కేసి రెండు చెంపల మీదా ముద్దులు పెట్టేసింది.

అప్పటికతనికి తృప్తయింది.

నెల్లాళ్ల కిందటే మూడెళ్లి నాలుగో ఏడు వచ్చింది పాపకి. వసపట్టక పోయినా పొట్ట నిండా మాటలే. కడుపు నిండా కబుర్లే.

పాప - రబ్బరు బొమ్మలా ముద్దుగా ఉంటుంది. ముట్టుకుంటే మాసి పోతుందేమో అనిపించేటట్లుంటుంది. గులాబి రంగులో గులాబి రేకులా సున్నితంగా ఉంటుంది. ముద్దొచ్చే ముఖమూ, ముచ్చట గొలిపే తీరూ అందుకే ఆ పాపంటే ఆ తండ్రికి ఎక్కడ లేని యిష్టమూ గారాబమూ. పాపంటే ప్రాణం.... వెర్రి.... అన్నీను.

"పిచ్చి -" అంటుంది నీలమ్మ.

నీలమ్మ యాదగిరి భార్య. పాపకి తల్లి అయినా ఆ తండ్రి కూతుళ్ళ వాలకాలు చూస్తూంటే ఆమెకొక్కొక్కప్పుడు ఒళ్ళు మండుతూంటుంది.

పాపకి బాలసారె తలపెట్టినప్పుడు "పాపకి నీ తల్లిపేరు - అనసూయని పెడదాం. అదే న్యాయమూ ధర్మమూ. చచ్చి స్వర్గానున్న మీయమ్మ ఆత్మ సంతోషిస్తుంది. కూతురు పుడితే మీయమ్మ పేరూ... కొడుకు పుడితే మీ అయ్య పేరూ పెట్టడం లోక రివాజు. నలుగురూ నడిచిన దారినే మనమూ నడుద్దాం" అని చిలక్కి చెప్పినట్లు చెప్పింది పాపకి రేపు పేరు పెట్టాలనగా.

"ఠర్..... వీల్లేదు..." అంటూ ఉపన్యాసం మొదలు పెట్టాడు. "మనది కడజాతి. హీనజాతి. మన కులంలో అందరూ నల్లగానే పుడతారు. నల్లగానే ఉంటారు. మరి.... మన పాపెలా ఉంది? సంపెంగ పువ్వే, పాప గులాబి మొగ్గే, ఎక్కడో గొప్పవాళ్లింట్లో.... కలవారి కుటుంబంలో పుట్టవలసింది. మహారాజులింట్లో పుట్టవలసింది. ఏ దేముడి వరానో మన కడుపున పుట్టింది. దేముళ్లకీ దేవతలకీ ఉండవలసిన పాప. మనకి మరలా దొరికింది. శాపవశాత్తూ మన లాటి వాళ్లింట వెలసిన దేవత. మనలాటి పూరి గుడిసెల మట్టిలో వెలసిన మాణిక్యం. అంచేత పాపని మనం నెత్తి మీదెట్టుకోవాలి. కంటికి రెప్పలా చూసుకోవాలి. ఘనంగా పెంచాలి. పాపకి తగ్గట్లు గొప్ప పేరెట్టాలి."

ఆ మాటలకి నీలమ్మ తెల్ల మొహం వేసింది. తమ పాప చక్కని చుక్క. అందాల బొమ్మే. ఐతే మాత్రం? దేవతా, రాణీ ఎలా ఔతుంది? తమ వాళ్లలో అలాటి వొంటి రంగు అరుదే. కొంచెం అబ్బురమే. కాని.... చర్మం తెల్లగా ఉన్నంత మాత్రాన దేవతలూ రాణీలూ ఐపోతారా మనుషులు? కాగలరా?

"చూడు మామా..... పాప అందమయిందే కాని అలాగని నువ్వు వింతలకీ విడ్డూరాలకీ పొమాకు.

ఏనాటి పిలక ఆ నాటి పలుకు పలికితేనే నప్పుతాది. ఏ నప్పికా పేరుంటేనే మంచి గుంటాది. మనం కదజాతోళ్లం. కలిమి లేనోళ్లం. మన పేర్లూ అలాగుంటేనే నయం. అడుక్కునే వోడికి కుబేరుడి పేరుంటే - ఎవళ్లవరకో ఎందుకు ఆడికే పక్కున నవ్వొచ్చేస్తాది. అంచేత మన పాపకి మనలాటోళ్ల కమువైన పేరు పెడితేనే మనమూ, అదీ నవ్వుల పాలు కాకుండా ఉంటాం. నే చెప్పవలసింది చెప్పాను. ఆ తరవాత నీ యిష్టం. తొక్క తెల్లగా వున్నంత మాత్రాన ఎక్కణ్నుంచో అంతరిచ్చం నుంచి అవతరించేసిందనుకోమాకు" అంది హెచ్చరిస్తున్నట్లుగా. ఆ మాటలకి యాదగిరి చర్రున లేచాడు. తను ఎంతో గొప్పగా భావించుకునే పాపని - ఆమె..... కన్నతల్లే..... అలా తెల్ల తొక్కంటూ తేలిగ్గా తీసి పారెయ్యడం అతనికి కోపం తెప్పించింది. "ఏమిటి మాట్లాడుతున్నావ్? ప్రపంచం నీకేటి తెలుసుననే? నీకేం చదువా, సంజా? ఏటనే...."

"అబ్బో! మాలావు సదివావు నువ్వు..... ఆరో కలాసు.... వానా కాలం చదువు...." నవ్విందామె ఎకసక్కెం చేస్తూ. అది పట్టించుకోకుండా అతను మళ్లీ ఉపన్యాసం మొదలు పెట్టాడు. "తెల్ల తొక్కని తేలిగ్గా నూడకే తెలివి తక్కువ ముఖమా. ప్రపంచమంతా తెలుపు నలుపుల్లోనే ఉంది. డబ్బు తెల్లన.... చదువు తెల్లన..... అధికారం తెల్లన. కులం తెల్లన. కావాలంటే నీ కళ్లతోనే చూసుకో మా పల్లెలో పంతులు గారు... పండితులు. ముహూర్తాలు పెట్టేవారు. శ్లోకాలు చదివే వారు. అందరి దణ్ణాలూ అందుకునేవారు. ఆరెలా ఉండేవారు? తెల్లగా విబూది పండులా.

మా వూర్రాజుగారు.... ఆరిపేరే నాకు నోరు తిరగదు. వచ్చనాయి రాజుగారు... చెయ్యెత్తు మనిషి... నిమ్మకాయలేటి, దబ్బపళ్లే - నిలబెట్టగల మీసాల్రాజుగారు.... హుంకరించారంటే ఎదుటి వాడెవడయినా హుజూరని వొంగి సలాము చేయవలసిందే... మరా 'రాజుగోరి రంగేమిటి? పండిన జాంపండు రంగు. పాలట్లో పచ్చ కర్పూరం, కుంకం పువ్వు కలిపినరంగు, పచ్చని పసిమి రంగు, మరి - మా పల్లెకంతా డబ్బున్న దివానంగారు, కన్ను చూడగలిగిన మేరా వారి పొలాలే. వారి మేడ అంచు చూడాలంటే నేలన నిలబడిన వాడు మెడలిరుచుకోవలసిందే. ఆరెలాగుండేవారు? మజ్జాన్న సూరీడులా.... కరుగుతున్న బంగారం రంగులో అంతెందుకే.... మనకంటె దొరలు గొప్పేకదా? ఇంగ్లీషు దొరలు... అమెరికా వాళ్లు.... గొప్పేకదా? ఆళ్లెందుకు గొప్పవాళ్లయ్యారు మనకంటె? ఆళ్లు తెల్లగా ఉండబట్టే. నీలి! నీకు తెలియదు కానీ.... తెలుసుకో.... తెలుపంటే అన్నింట్లోనూ ఎక్కువే నలుపుకంటె. అందుకే చెబుతున్నాను. మన పాప సామాన్యురాలు కాదు. గొప్పది. కనక మామూలు పేరుండకూడదు. గొప్ప పేరుండాలి. బంగారానికి బంగారం లాంటి పేరుండాలి కాని మట్టి, యినుము అంటావేటి?"

మొగుడికి రెండు చేతులూ జోడించి దణ్ణం పెట్టేసిందామె. "నీ యిష్టమొచ్చిన పేరెట్టుకో. నా బుర్రవాయ గొట్టక" అనేసింది అతన్ని జయించలేక.

విజేతలా నవ్వుతూ.... మీసాలు మెలేస్తూ..."నా పాప పేరు మహారాణి" అన్నాడతను. నీకర్మ అని మనసులో అనుకుని - అటు తిరిగి నెత్తి కొట్టుకుంది నీలమ్మ. ఈ మహారాణి రేపు పెరిగి పెద్దదై తాపీ మేస్త్రీ దగ్గర కూలి పనే చేస్తుందా? ఎవరిళ్లల్లోనో అంట్ల బొచ్చెలు తోముతుందా? అన్న ఆలోచన వచ్చిందామె మెదడులోకి.

ఏమయితేనేం, పాపకి మహారాణి అన్న పేరు పెట్టబడింది. రాణి అని పొట్టి పేరు. ఐతే.... వాడుక పేరు మాత్రం పాపే. నీలమ్మకెందుకో తన పిల్లని రాణీ అని పిలవడానికి ఎబ్బెట్టుగా అనిపించి, యాదగిరికి ముద్దు కొద్దీ పాపా అనడమే అలవాటయిపోయి - పాప అనేదే పేరుగా స్థిరపడిపోయింది.

పాపకారు నెలలు నిండాయి. యాదగిరికి సాయంత్రం వేళ తీరిక దొరికితే చాలు పాపనెత్తుకుని షికార్లు తిప్పసాగాడు. పాప తన పెద్ద కళ్లనటూ యిటూ చకచకా తిప్పేస్తూ రోడ్డు మీది బస్సులనీ వాటినీ చూస్తూంటే..... కేరింతలు కొడుతూంటే.... ఆ పాప కళ్లనీ ముఖాన్నీ చూడడం అతనికెంతో అద్భుతంగా ఉండేది.

"నువ్వు తిప్పవేం పాపని?" ఓసారి భార్య నడిగాడు యాదగిరి. పాపని తను పట్టించుకునేం తగా.... తను ముద్దు చేసేంతగా... ఆమె చెయ్యడం లేదేమో అని అతనికనుమానం. దానికాధారం ఆమె ప్రవర్తనే. నెల్లాళ్లకిందట ఒకేసారి పాపని ఎత్తుకుని బయటకు తీసుకెళ్లింది. తనవి పాపతో తొలిసారిగా చూసిన పరిచయస్తులు కొందరు...

"ఎవరి పాపే? అందాల బొమ్మలా ఉంది...." అడిగారు.

"నా బిడ్డే" -


"నిజమే?" నమ్మలేనట్లు చూశారు.


"ఇలాటి సమయాల్లో అబద్ధా లాడతారేటెవరయినా?"

"నువ్వేమో బొగ్గుల బస్తాలా ఉంటావు. యాదగిరేమో కర్రి మొద్దులా ఉంటాడు. మీకిలాటి ఎర్ర పాపెలా పుట్టిందే? ఇది కడుపులో పడేముందు నువ్వు ఏ రాజులింట్లో అయినా పని చేసేదానివా?" విషపు నవ్వు. వ్యంగ్యం. ఆ ప్రశ్నలోని అర్థమూ అంతరార్థమూ తెలిసి - గుండెల్లో బాణాలు గుచ్చినట్లే అయిందామెకి. రోషమూ పౌరుషమూ ఎగదన్నాయామెలో.

"కూటికి పేదలమవచ్చు. కులానికీ తక్కువ వాళ్లం కావచ్చు. కాని గుణానికి మేమూ ఎవరికీ తీసిపోయే మనుషులం కాము" అని ఒక్కసారాగి "మా మనసుల్లోకి కూడా పాడాలోచనలూ పాపపుటా లోచనలూ రావు" అంది - వారి చెంప పగిలి చేతికొచ్చేటట్లే. అటు పిమ్మట వారిమెను పలకరించడం మానేశారు. వారితో స్నేహాలూ మోహమాటాలూ చెడిపోయాయి. కారణం - రాణిగారే. మరో రోజు.... తప్పనిసరయి..... తను పని చేసే యింటికి తీసుకెళ్లింది. పట్నమన్న పేరే కాని.... వూరు పెద్దదన్న మాటేకాని..... యిక్కడి మనుషుల మనసులు మహా యిరుకు. తను తక్కువ కులందని ఎవరూ యింటి పనులకి పెట్టుకోరు. ఇల్లూడ్చడానికీ అంట్లు తోమడానికీ కూడా కులం కావాలి మనుషులకి! పల్లెటూళ్లకంటె ఏం ముందుకి పోయాయీ పట్నాలు? తమ కులం వాళ్లే తనని పనిలో పెట్టుకున్నారు. వాళ్లకి డబ్బు బాగా ఉంది. ఆయనేదో పెద్ద ఆఫీసరు. ఆయమ్మ మాత్రం ఏమందీ పాపని చూసీ చూడగానే?

"ఏమే నీలీ? మన్లో మనమాట నిజంగా..... నీ పాప యాదగిరికే పుట్టిందా? అహా... ఆ రంగూ... అదీ చూస్తే అనుమానమొస్తూంది. అందుకడుగుతు





పోటీకి ముందు నూతన సంవత్సర ప్రార్థనలు చేస్తున్న సుమో పహిల్వాన్ ముసాశిమారు. టోక్యోలో జరిగిన మల్ల యుద్ధంలో వకానోయామాని ముసాశిమారు ఎదుర్కొన్నాడు.

న్నాను. నీ పెనిమిటేమో బండా, రాక్షసి బొగ్గూ..... ఇదేమో ఎర్ర గులాబి పువ్వూను."

తనకి కోపమొచ్చింది.

కాని - నోరు పెగల్లేదు.

తను ఆవిడకంటే అందంగా ఉంటుందని మొదటే తన మీద అసూయ. తన మొగుణ్ణి తను వలలో వేసేసుకుంటుందేమో అని భయం. అది ఆ మాటలోనూ యీ మాటలోనూ బయటపడుతూనే ఉంటుంది. ఆవిడగారి అనుమానాలకీ అధికారానికీ వొళ్లు మండి ఏనాడో పని మానేసేదే. కాని.... యీ యిల్లొక్కటే ఉంది. దొరక్క దొరక్క దొరికిన ఒక్కిల్లు కూడా వదిలేసుకుంటే పస్తులుండవలసొస్తుందేమో.... పేదోళ్ల కోపం పెదవికి చేటు. ఇప్పుడు - మునపట్లా కాదు. పాపుంది. తనూ మామా ఐతే ఆకల్తో ఉండగలరు కానీ పసిదాన్ని పాల్లేకుండా పడుగోబెట్టలేరే! అదీ కాక మామేటి సెప్పేడు?

"మన పాప.... రాణి.... కర్మకాలి పూటకి గతిలేని పూరింటిలోనే పుట్టుండొచ్చు. అంత మాత్రానికి దాని పెంపకంలో లోటు రాకూడదు సుమా! మనకి గెంజి నీళ్లు లేకపోయినా పర్లేదు. పాపకి మాత్తరం పాలుండి తీరవలసిందే. అది తాగలేక పారబోసేన్ని పాలుండాలెప్పుడూ. నాకు గోచీ లేకపోయినా బాధ లేదు. పాపకి మాత్రం ఎప్పుడూ మంచి గౌనుండి తీరాలి. మనం కటిక నేలనే పడుకున్నా రాణికి మాత్రం మెత్త పరుపే ఉండాలి. మనమేటయిపోయినా ఎలా పోయినా పర్లేదు. పాపమాత్రం మహారాణిలాగే సుఖంగా సక్కగా బతకాలి. అది మాత్రం ఎప్పుడూ మరచిపోమాకు" హెచ్చరిస్తున్నట్లే చెప్పాడు.

మిగిలిన విషయాలెలా ఉన్నా.... యింట్లో పనులెక్కువున్నా, ఆవిడగారి అసూయ మాటలు పడడం కష్టమనిపించినా.... జీతం బాగా గిడుతుందనీ, రోజా తిండి దొరుకుతుందనీ - యీ యిల్లు వదిలి పోక పోవడం కాని.... ఎంత మాటందీ!

"తమరికి తెలియందేముంది? బురదలోంచే తామర పుష్పం పుడుతుంది కదా. ముళ్లల్లోనే గులాబి పువ్వు పూస్తుంది కదా? అంత మాత్తరాన ఆ తామరా గులాబీ ఎబిచారం వల్ల పుట్టినట్టేనా? ఎబిచారానికే దిగజారగలిగితే సాటి కులమాల్లింట పాచి పన్లు చేయవలసిన కర్మేంటి? నీతిని పట్టుకు వేలాడ్డం వల్లే కాలు జారలేక కష్టపడి బతకడం" అంది వూరుకోలేక.

"సర్లే పని చూడు" అందావిడ ముఖం మాడ్చుకుని, అక్కణ్ణుంచి వెళ్లిపోతూ.... ఏదేమయినా ఒకటి తెలిసింది నీలమ్మకి.

తమ పాప సామాన్యమయింది కాదు. అందరి పాపల్లాగా కాదు. దీనితో మహా చెడ్డ చిక్కు. అలాటి విషపు మాటలు తనన్నారు కాబట్టి సరిపోయింది. అదే కాని మామనంటే? ముందే - మగాడు. నిప్పులేని చోట కూడా పొగని చూడగలవు మగకళ్లు. ఆడి మనసులో కాని ఎవరేనా అనుమానం విషం చిందిస్తే తమ కాపరం ఏమౌతుంది? ఈ ఎర్ర తోలు పాప ధర్మమా అని తమ సంసారానికే ఎసరు రాదు కదా!

ఆవేళ నుంచీ ఆ పసిదాన్ని చూస్తే భయమే వెయ్య సాగిందామెకి.

అందుకే పాపని ఎక్కడికీ తీసుకెళ్లటం మానేసింది.

ఏ సాయంత్రమో మామ తీసుకెళ్లబోయినా - "పక్షులు పారే వేళ. ఇలాటప్పుడు చంటి పిల్లల నాకాశం కిందా ఆరు బయటా తిప్పితే పక్షి దోషం తగులుతుంది. పిల్ల - పచ్చందినాల్లో పక్షిలా ఎండిపోతుంది" అని భయపెట్టి నివారించేది.

అయినా తన గుండెలు గుబేలు గుబేలు మంటూనే ఉంటాయి - ఎప్పుడు ఎలా పాపవల్ల తన కాపరానికి ముప్పొచ్చి పడుతుందో అని. కన్న కూతురిని చంటిదాన్ని చూసి జడుసుకోవలసిన కర్మ. ఇదంతా మామకెలా చెప్పగలం?

"నువ్వు తీసుకెళ్లి తిప్పుతున్నావుగా... చాలులే. నేను కూడా తీసుకెళ్లి తిప్పితే మరిన్ని మిరపకాయలు దండగ" అనేసింది నువ్వు తెచ్చి పెట్టుకుంటూ. ఔను. దాన్ని వీధిలోకి తీసుకెళ్లి తిప్పుకొస్తాడా? రావడమే తడవు.... "పాపకి దిష్టి తియ్యవే. రోడ్డు మీద అందరి కళ్లూ దీనిమీదే. ఒకళ్లు ముద్దెట్టుకోడమూ, మరొకళ్లు బుగ్గమీద చిటికెయ్యడమూ.... చూసిన వాళ్లు కళ్లు తిప్పుకోగలిగితేనా? ఎంత బాగుందెంత బాగుం దంటూ ఒకటే దిష్టి పెట్టం. దిష్టి తియ్యి" అంటూ వేధింపు. తాలింపుకున్నా లేకపోయినా పాప దిష్టి తియ్యడానికి మాత్రం ఎండు మిరపకాయలింట్లో లేకపోతే ముష్టైనా తేవలసిందే.

పాపకెనిమిదో నెల వచ్చింది. తను భయ పడ్డట్టు కాకపోయినా మరో తీరులో తన సంసారం మీదకి మునలమూ వచ్చి పడింది.

ఆవేళ పొద్దుటెల్లిన వాడు చీకటి పడే వేళకు తిరిగొచ్చాడు మామ, చేతిలో పాపకి తీపితో. "మామా! అంత నీరసంగా ఉన్నావేమి?" అడిగింది.

జవాబుగా రెండు వందల రూపాయలు చేతిలో పెట్టి - మంచం మీద వాలిపోయాడు. తనకి భయమేసిందతని వాలకానికి. "అడిగిందానికి జవాబు చెప్పవేం?"

"నేను.... ఓ పని చేశానే నీలీ.... నువ్వేమంటావో మరి...." నీళ్లు నమిలాడు.

"ఏం చేశావు?" ఆరాటంతో చచ్చిపోతూ అడిగింది.

"ఆపరేసను చేయించుకున్నానే...." గొణిగాడు.

"ఆపరేసనా? ఎందుకూ? ఏమయింది?"

"ఇంక పిల్లలు పుట్టకుండా.... సంతానం కలగ కుండా..... ఆపరేసను. అందుకు డబ్బు కూడా యిచ్చారాసుపత్రిలో."

నివ్వెరపోయింది నీలమ్మ. "ఇంక పిల్లలు పుట్టకుండానా! మనకెంత మంది పిల్లలున్నారనేం?" అంటూ ఏడవసాగింది. పెనిమిటి మీద పట్టరానంత

కోపమొచ్చింది. "నాతో ఒక్క మాటేనా చెప్పావు కాదు ముందుగా. అంతా నీ యిష్టమేనా? ఈ యింట్లోనూ సంసారంలోనూ నేనేమీ కానా? నేను లేనా? అయ్యో.... యిక మనకి పిల్లలే ఉండరా! మగపిల్లాడు పుట్టకుండా.... ఒక్క ఆడపిల్లతో.... ఆపరేసను చేయించేసుకుంటావా! నాకన్యాయం చేస్తావా! ఎందుకు చేశావిలాటి ముదనష్టపు పని....?" భోరుమందామె - అతన్ని పట్టుకుని గుంజేస్తూ ఇక తప్పదనిపించింది కాబోలు అతను నోరు విప్పాడు.

"ఎందుకంటే.... మనోసమే. మనకింకా పిల్లలు పుడితే పాపని బాగా పెంచలేం. పాపొక్కతయితేనే నయమని" అన్నాడు మెల్లగా....

ఆమె నిర్ఘాంత పోయింది. "నీ పిచ్చి దొంగలు తోలా! ఇదేం వెర్రి మామా!"

"ఔనే నీలీ. మనం పేదవాళ్లం. నాకు చాలా పనులే చేతయినా - చెయ్యడానికి పనే దొరకదు రోజా. ధరలుజూస్తే ఆకాశంలోకి, పనులు చూడబోతే పాతాళంలోకి, మహ మహ వాళ్లే యిద్దరు బిడ్డలతో సరిపెట్టేసుకుంటున్నారు. ఆళ్ల ముందు మనమెంత? మనలాటి బక్క ప్రాణాలకి ఓ బిడ్డే ఎక్కువ నిజానికి ఇంకో బిడ్డని కన్నామో పాపకన్యాయమయిపోద్ది. అందుకనీ..... ఆపరేసను చేయించేసుకున్నాను."

ఇంకేమనగలదామె? అని మాత్రం ఉపయోగం మేమిటి? నెత్తీ నోరూ బాదుకుని ఏడ్చినంత సేపేడ్చి నోరు మూసుకుంది. ఎవరికీ చెప్పుకునే సంగతి కాదాయె. విన్నవాళ్లు నవ్వరూ?

"నన్ను క్షమించవే నీలీ" అంటూ ఆమె పాదాలు పట్టుకున్నాడు యాదగిరి.

"నేం జేసింది తొందరపాటు పనేనే. తప్పేనే. పెళ్లానివి, నీకు జెప్పకుండా, నీ చేత ఔననిపించు కోకుండా అలా చేసుండకూడదు. పాప గురించే ఎంతసేపూ ఆలోచించేను కానీ..."

దాసుడి తప్పులు దండంతో సరి.

మగాడి తప్పులు రెండు మంచి మాటలతో సరి.

ఇక ఆ కుటుంబంలో రాణి ఒక్కతే తల్లితండ్రులకి - అని తేలిపోయింది. దాంతో యాదగిరి వెర్రి మరీ ఎక్కువయిపోసాగింది.

"రోజా తీపి తింటూంటే మిఠాయి రంగులో ఉంటారు" అని ఎవరో అనగా విన్నాడు. ఆ రోజు నుంచీ - హరి మీద గిరి పడ్డా గిరిమీద హరిపడ్డా రాత్రి యింటికి వచ్చేటప్పుడు పాపకి తీపి తేవలసిందే. స్వయంగా తినిపించవలసిందే.

ఒకసారి రోజంతా ఏ పనీ దొరక్క డబ్బులు లేకపోడంతో - రక్తం అమ్మి.... తీపి కొని తెచ్చాడు.

యాదగిరికి నిజంగానే చాలా పనులు చేతనవును. రిక్షా తొక్కుతాడు. రాళ్లు పాలిగొంటారా. పెద్ద వయసొచ్చు ఇలా ఎన్నెన్నో పనులు చెయ్యాలంటూ శరీర దారుఢ్యం కలవాడు కావడంతో.

'చిన్న పిల్లలకి పడుకోబోయే ముందు కథలు చెబితే వాళ్ల శరీరారోగ్యానికీ మానసికారోగ్యానికీ చాలా మంచిది. కళ్లు తెలివి తేటలతో పెరుగుతారు' అని ఎవరో ఎవరికో చెబుతూంటే విన్నాడు. అంతే. అతని మెదడులో పాప మెదిలింది. పాపకి కథలు చెప్పాలి అనుకున్నాడు. ఒక అయ్యగారిని పట్టుకున్నాడు. వారికి పనులు చేసి పెడుతూనూ, ఉన్నప్పుడు గురుదక్షిణ యిచ్చుకుంటూనూ కథలు నేర్చుకున్నాడు. సెంటర్లో - బేరాలు లేకుండా తిరిగ్గా ఉండే రిక్షావాళ్లకి - తనకి అభ్యాసమౌతుందనీ, వాళ్లకి కాలక్షేపమౌతుందనీ ఆ కథలు చెప్ప సాగాడవకాశం దొరికినప్పుడల్లా. కథలు చెప్పేవాళ్లు వినేవాళ్లకి ఇష్టులైపోతారు కదా? యాదగిరి మంచి తనంతో పాటు యీ కథలు కూడా తోడై అతనికి చాలా మంది స్నేహితులని సంపాదించి పెట్టాయి. సాటి కార్మికులలో ఎవరికవకాశం దొరికినా అతనికి పనులు చూపిస్తూంటారు. ఇంటి దగ్గర పాపకీ.... యిక్కడ వీళ్లకీ అతను ప్రత్యక్ష పురాణంలా కథలు చెబుతాడు, ఆ కథలలోని పాత్రలు తానే ఔతూ.

"ఉదయం నుంచీ బొంగరంలా ఊరంతా తిరుగుతున్నా పని దొరకడం లేదెక్కడా. బజారులో మూటల మోత పని లేదు. రైల్వే స్టేషనులో వ్యాగన్ల లోడింగ్ పని దొరకలేదు" అంటూ వాపోయాడు సాటివాటి ముందు. పట్నమయితే కష్టపడి పనిచేస్తే పాయసం జుర్రేసుకోవొచ్చని పల్లె నుంచి పారొచ్చేసేం. ఇక్కడా పనులు దొరకటం లేదు."

"నీకే కాదు. చాలా మందికే చేతులు ముడుచు కూర్చోవలసిన రోజులొచ్చేశాయి పట్నంలో కూడా. సిటి బస్సు, ఆటో వచ్చి రిక్షావాళ్ల పొట్టలు కొట్టాయి. దాంతో వాళ్ల చేతులకీ కాళ్లకీ పని కరువై మూతులెండి పోడం మొదలెట్టాయి."

"రెండో పూటలోకం. కష్టపడతాను మొర్రో అన్నా ఎవ్వరూ పని దొరకదు."

"ఈ ప్రభుత్వాలు.... యీ పరిపాలన.... యీ రాజ్యాం - మనలా శ్రమపడి బతకాలనుకునే వాళ్లున్నారు. పోటుపోతులకి మాయగాళ్లకి.... మోసగాళ్లకి..." తన కోపమంతా వెళ్లగక్కుకున్నాడ తను. ఆకలింటేనే కోపమూ. కదా?

యాదగిరికి అటువంటి మాటలు వినపడటం లేదు. ఎందుకంటే...

అతని మనసులో వేరే ఆలోచనలు సాగుతున్నాయి.

కొంచెమేనా డబ్బులు సంపాదించక పోతే పాపకి తీపి తీసుకెళ్లడం ఎలా? అంతలో....

"యాద్గిరీ!"

ఆలోచనలలోంచి బయటపడి పిలుపు వినపడిన దిక్కువేపు చూశాడు. కనకం. రిక్షా కనకం. "నాకు పనుంది యాద్గిరీ. చీకటడేయేళ వరకూ బండేసుకో. అప్పుడు రామచంద్రా సెంటరు కొచ్చేసి నాకు బండియ్యి ఏం?" అంటూ బండిచ్చాడు. బతుకు జీవుడా అనుకున్నాడతను.


ఇలా బండి తీసుకున్నాడో లేదో - అలా బేరం. అక్కడి నుంచి ఒకదాని వెంట ఒకటిగా అన్నీ బేరాలే. మంచి కిరాయిలు. గీసి గీసి బేరమాడనవి. న్యాయంగానూ ధర్మంగానూ డబ్బులిచ్చేవి. అందు చేతనే చీకటి పడుతున్న వేళకి రామచంద్రా సెంటరు కొచ్చేసరికి ముప్ఫయ్యయిదు రూపాయలు చేరాయతని దగ్గర. పది రూపాయలు కనకానికిచ్చేసి.... ఐదు రూపాయలతో పాపకి కొత్త రకం స్వీటు కొని - యిల్లు చేరేసరికి యింకా పూర్తిగా చీకటి పడలేదు.

పాపకి స్వీటు తినిపించి.... ముద్దులందుకుని.... తన దగ్గరున్న యిరవై రూపాయలూ నీలికిచ్చి బజారు చెయ్యమందామనుకుంటూంటే -

"అయ్యా!" మెల్లగా పిలిచింది పాప.

**(ముగింపు పైవారం)**

## కె.ఎస్.ప్రకాష్ కన్నుమూత



ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.ఎస్. ప్రకాష్ జనవరి 10వ తేదీన మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న 'కె.ఎస్' చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. మూడు దశాబ్దాల పాటు చిత్ర సీమతో అనుబంధం కలిగివున్న ఈయన అడవిరాముడు, అగ్నిపర్వతం, వజ్రాయుధం, ఊరికి మొనగాడు, అల్లుడుగారు వంటి సూపర్ డూపర్ హిట్ చిత్రాలకెన్నింటికో కెమెరామెన్‌గా పనిచేశారు. తెలుగులోనే గాక పలు హిందీ చిత్రాలకు కూడా సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. అంతేగాక రౌడీగారి పెళ్ళాం, దొంగ-పోలీస్, చిత్రాలకు దర్శకత్వం కూడా వహించారు. 55 సంవత్సరాల 'కె.ఎస్' ప్రముఖ దర్శకులు కె. రాఘవేంద్రరావు సోదరుడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కె.ఎస్. ప్రకాష్ మృతి పట్ల చిత్ర పరిశ్రమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. (ఒ.వి)